


జనవరి 10-12 తేదీల్లో ఫ్లెమింగో ఫెస్టివల్

ప్రజాశక్తి-సూళ్లూరుపేట

సూళ్లూరుపేట కేంద్రంగా ప్రతి ఏటా రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఫ్లెమింగో ఫెస్టివల్‌ను 2025, జనవరి 10వ తేదీ నుండి మూడు రోజులపాటు జరపాలని నిర్ణయించారు. 2020 తర్వాత ఫ్లెమింగో ఫెస్టివల్ జరగలేదు. కరోనా వంటి మహమ్మారి వ్యాధులు ప్రబలడంతో నాలుగు సంవత్సరాలు తర్వాత తిరిగి ఈ ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ ఫెస్టివల్‌కు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ హాజరయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

విజృంభిస్తున్న విషజ్వరాలు

వైరల్.. వణికిస్తోంది..!



ఈ ఫొటోలో వున్న వ్యక్తి పేరు మీరా సాహెబ్. మూడు రోజులుగా జ్వరంతో ఇబ్బందులు పడుతున్నాడు. ఆర్‌ఎంపి వైద్యుల దగ్గర ట్రీట్మెంట్ తీసుకుంటున్నప్పటికీ జ్వరం తగ్గకపోగా, ఉన్నట్టుండి జ్వరం తీవ్రమైంది. నొప్పులు ఎక్కువయ్యాయి. చేతి వేళ్ళు, కాలి వేళ్ళు, మడమల వద్ద భరించలేనంత నొప్పిగా ఉందంటూ తిరుపతి రెడ్డి రెడ్డి కాలనీలోని ఓ పేరు మోసిన జ్వరాల డాక్టర్ వద్ద చికిత్స తీసుకుంటున్నాడు. కాయ కష్టం చేసి ఆరు నెలలుగా కూడబెట్టిన పైసా పైసా కూడా ఈ వైరల్ జ్వరం దెబ్బకు ఖర్చయిపోయిందంటూ వాపోయాడు.

కమ్మేస్తున్న గ్రామాలు, పట్టణాలు
జ్వరపీడితులు ఏడువేలకు పైనే...
డెంగీ 1300, చికున్‌గున్యా 150, మలేరియా 150

ప్రజాశక్తి - తిరుపతి



ఉమ్మడి చిత్తూరు జిల్లాను వైరల్ జ్వరాలు వణికిస్తున్నాయి. వాతావరణ మార్పులతో రోజురోజుకూ జ్వరపీడితుల సంఖ్య పెరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలు, గ్రామాల్లో పారిశుధ్య లోపాలు మొదలైన కారణాల వల్ల సీజనల్ వ్యాధులు విజంభిస్తున్నాయి. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో అధికారికంగా 7వేలకు పైగా వైరల్ ఫీవర్లు, 1300కి పైగా డెంగీ, 150 దాటిన చికున్‌గున్యా, 150 కి పైగా మలేరియా కేసులు నమోదు అయినట్లు తెలుస్తోంది. రామచంద్రాపురం మండలంలో వైరల్ ఫీవర్ అధికమవడంతో స్వయంగా జిల్లా పంచాయతీ అధికారి సుశీల దేవి పర్యటించి అధికారులతో సమీక్షించారు. తిరుపతి అర్బన్ జీవకోన, ఎస్ టి వి నగర్, తిరుపతి రూరల్ మంగళం, రేణిగుంట మండలం తారకరామా నగర్ తదితర ప్రాంతాల్లో వైరల్ ఫీవర్లు ఎక్కువగా ఉన్నట్లు అధికారులు సైతం గుర్తించి నియంత్రణ చర్యలు చేపట్టారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. పట్టణాల్లో అర్బన్ హెల్త్ సెంటర్లు, పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ప్రైవేటు హాస్పిటళ్లకు రోగులు పరుగులు తీస్తున్నారు. ప్రతి ఇంట్లోనూ చిన్నారుల నుంచి పెద్దల వరకు సగటున ఒకరిద్దరికి పైగా జ్వరపీడితులు వుండటం గమనార్హం.

తిరుపతి, చిత్తూరు జిల్లా కేంద్రాల్లోని ప్రధాన ఆసుపత్రుల్లో వేలాది మంది చికిత్స కోసం చేరుతున్నారు. ప్రస్తుతం జ్వరం తగ్గక గొంతునొప్పి, దగ్గు, జలుబు లక్షణాలతో ఆసుపత్రుల్లో చేరుతున్న కొందరిలో రక్తఫలికలు (ప్లేట్లెట్స్) తగ్గుతున్నాయి. ఓవైపు చికెన్ గున్యా, మరోవైపు డెంగీ, ఇంకోవైపు మలేరియా డేంజర్ బెల్స్ మోగిస్తోంది. వాతావరణ మార్పులు ఒక వైపు.. పారిశుద్ధ్య లోపం మరోవైపు ప్రజలను రోగాలపాలు చేస్తున్నాయి. చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా రోగులు దవానాఖానాకు పరుగులు పెడుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు, సిబ్బంది కొరత వేధిస్తుండగా, ప్రైవేటు దవాఖానలకు కాసులు కురిపిస్తూ పేదల జేబులకు చిల్లులు పడుతుండటం గమనార్హం. ఉమ్మడి జిల్లాలో డెంగ్యూ వ్యాధి లక్షణాలతో బాధపడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో 1300 కేసులు నమోదయ్యాయి. ఇటీవల గూడూరు ప్రాంతంలోని దక్కిలి గురుకుల పాఠశాలలో చదువుతున్న ఓ విద్యార్థి మాత్రమే డెంగీతో చనిపోయారు.

రుయా, స్విమ్స్‌లో రోజుకు 400 పైగా బాధితులు

తిరుపతిలోని రుయా ఆసుపత్రికి రోజుకు సుమారు 150 నుంచి 200 మందికి పైగా జ్వరంతో బాధపడుతున్న వారే వస్తున్నారు. ఇక స్విమ్స్ ఓపి లకు మరో 250 మందికి పైగా జ్వరపీడితులు వస్తున్నట్లు తెలుస్తోంది. జ్వరం, ఒళ్లు నొప్పులు, తలనొప్పి అంటూ తిరుపతి నగరంలోని పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో మరో 500 మందికి పైగా జ్వర పీడితులూ ప్రతిరోజూ చికిత్స పొందే పరిస్థితి నెలకొంటుంది. తిరుపతి నగరం రెడ్డి రెడ్డి కాలనీలోని ఓ ప్రముఖ జ్వరాల డాక్టర్ వద్దకే రోజుకు 110 నుంచి 130 కేసులు వస్తుండటం గమనార్హం. ఇక ఉమ్మడి జిల్లాల పరిధిలోని పీహెచ్ సి, సి హెచ్ సి లు, ఏరియా , ప్రధాన ఆసుపత్రుల్లో రోజుకి సుమారు 3 వేల మందికి పైగా ప్రతిరోజూ జ్వరాలతో బాధపడుతున్నట్లు వైద్య వర్గాలే పేర్కొంటున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రిల్లో మందులు కొరత ఉండటంతో ఏ జ్వరం వచ్చినా నాలుగు పారాసెటమాల్ మాత్రలిచ్చి సరిపెడుతున్నారంటూ ప్రజా సంఘాల నేతలు వాపోతుండడం గమనార్హం.

ప్రైవేటుకు కాసుల వర్షం

విష జ్వరాలు ప్రైవేటు దవాఖానకు కాసులు కురిపిస్తున్నాయి. జ్వరం, డెంగ్యూ బాధితులతో ప్రైవేటు దవాఖానలు కిటకిటలాడుతున్నాయి. కొన్ని దవాఖానల్లో వైరల్ ఫీవర్‌తో వచ్చిన రోగులకు అవసరం ఉన్నా లేకపోయినా ప్లేట్‌లెట్లు ఎక్కిస్తున్నారు. దీంతో రక్తకణాలకు డబ్బులు కట్టలేక రోగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు లోనవుతుండటం గమనార్హం.

దోమలు బాబోయ్ దోమలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

జిల్లా లోని మున్సిపాలిటీల పరిధిలో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. వర్షాలకు చెత్తకుప్పలు దోమలకు నిలయంగా మారాయి. మురికికాల్వలు శుభ్రం చేయకపోవడంతో రోడ్లపైనే మురుగునీరు ప్రవహిస్తోంది. పద్మావతినగర్, రెడ్డిగుంట షాపు వీధి చివర, శివసాయి నగర్ ప్రాంతాల్లో నివాసాల మధ్య మురికినీరు నిలిచిపోయి పారిశుధ్యం అధ్వానంగా ఉంది. దోమల నివారణకు ఫాగింగ్ చేసే పరిస్థితి మున్సిపాలిటీకి లేదు. కనీసం బ్లీచింగ్ కూడా చల్లడం లేదన్న విమర్శలున్నాయి. దీంతో ఆస్పత్రుల్లో జ్వరపీడితులు క్యూ కడుతున్నారు.



పుత్తూరు ఆస్పత్రిలో రోగుల క్యూ

తిరుపతికి 'స్లీపర్' వందేభారత్

విశాఖ నుంచి నడిపేందుకు కసరత్తు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతికి వచ్చే ప్రయాణికులకు 'వందే భారత్ స్లీపర్' అందుబాటులోకి రానుంది. తెలుగు రాష్ట్రాల్లో వందే భారత్ రైళ్లకు ఆదరణ కనిపిస్తోంది. ఎంపీల నుంచి వస్తున్న డిమాండ్ల మేరకు కొత్తగా వందే భారత్ రైళ్లను తెలుగు రాష్ట్రాల నుంచి నడిపే అంశం పైన రైల్వే శాఖ కసరత్తు చేస్తోంది. అందులో భాగంగా ఇప్పుడు కొత్తగా తీసుకొస్తున్న వందేభారత్ స్లీపర్ రైలును తిరుపతి నుంచి విశాఖకు నడిపే ప్రతిపాదన పైన కసరత్తు దాదాపు పూర్తయ్యింది. దీని పైన అధికారులు రైల్వే శాఖకు ఇప్పటికే ప్రతిపాదనలు సమర్పించారు.

తిరుపతి టు విశాఖ

తిరుపతి నుంచి వందేభారత్ రైళ్ల సంఖ్య పెంపు కోసం రైల్వే శాఖ కసరత్తు చేస్తోంది. ఇప్పటికే తిరుపతి సికింద్రాబాద్ మధ్య వందే భారత్ రైలు నడుస్తుంది. విజయవాడ వయా రేణిగుంట మీదుగా చెన్నైకు వందే భారత్ రైలు నడుస్తోంది. తిరుపతి బెంగళూరు చెన్నై మధ్య కూడా వందే భరత్ నడపాలని జిల్లా వాసులు, ప్రజా ప్రతినిధులు నుంచి డిమాండ్ ఉంది. అలాగే విశాఖ మీదుగా నాలుగు వందేభారత్ రైళు నడుస్తున్నాయి.



విశాఖపట్నం–సికింద్రాబాద్ మధ్య రెండు, భువనేశ్వర్కు ఒకటి, దుర్గ్కు కొనసాగుతున్నాయి. కొత్తగా విశాఖ నుంచి తిరుపతి, బెంగళూరుకు వందేభారత్ అందుబాటులోకి తీసుకురావాలని రైల్వే మంత్రికి ఎంపీల నుంచి ప్రతిపాదనలు అందాయి. వీటిని అధ్యయనం చేయాలని అధికారులకు రైల్వేశాఖ సూచించింది.

తొలి ప్రాధాన్యత

ఈ ప్రతిపాదనల పైన రైల్వే బోర్డు సానుకూలంగా స్పందించింది. కొత్తగా సిద్ధం అవుతున్న వందే భారత్ స్లీపర్ రైళ్లను విశాఖ నుంచి ప్రారంభించేందుకు అంగీకరించారు. దేశ వ్యాప్తంగా ఉన్న డిమాండ్ కారణంగా ప్రస్తుతం ఒక వందేభారత్ స్లీపర్ ను విశాఖనుంచి ప్రారంభించేందుకు అంగీకరించారు. దేశ వ్యాప్తంగా ఉన్న డిమాండ్ కారణంగా ప్రస్తుతం ఒక వందేభారత్ స్లీపర్ ను విశాఖ నుంచి తిరుపతికి ప్రారంభించేలా అంగీకరించినట్లు తెలుస్తోంది. విశాఖ – తిరుపతి మధ్య దూరం ఎక్కువ కావటంతో 160 కిమీ వేగం తో పాటుగా ఆధునిక టెక్నాలజీతో విలాసవంతమైన సౌకర్యాలతో రూపొందిస్తున్న వందేభారత్ స్లీపర్‌ను ఈ మార్గంలో నడిపేందుకు రైల్వే శాఖ ముందుకు వచ్చింది.

రూట్ - షెడ్యూల్

ఈ రైలు ఏర్పాటు ద్వారా తిరుపతి–విశాఖ మార్గంలో నడిచే ఇతర ప్రధాన రైళ్ల పైన ఒత్తిడి తగ్గే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ప్రతి రైలులో 16 కోచ్లు, 832 నుంచి 1,128 వరకూ బెర్తులు ఉంటాయి. జనవరిలో ఈ రైలు పట్టాలు ఎక్కే అవకాశం ఉంది. ఇందులో టిక్కెట్ ధర రాజధాని ఎక్స్ప్రెస్ రేట్లతో సమానంగా ఉంటుంది. ప్రస్తుతం విశాఖ – తిరుపతి సూపర్ ఫాస్ట్ రైళ్లు నడుస్తున్న మార్గంలోనే రాజమండ్రి, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు మీదుగా రాత్రి సమయాల్లో ఈ వందేభారత్ స్లీపర్ కొనసాగేలా అధికారులు తుది షెడ్యూల్ ఫిక్స్ చేస్తున్నారు.

అందుబాటులో కార్గో డోర్ డెలివరీ :కలెక్టర్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతి జిల్లాలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వారు ప్రజలకు మరింత చేరువగా కార్గో సేవలను అందించుటకు డోర్ డెలివరీ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చిందని, ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ డా.ఎస్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం స్థానిక జిల్లా కలెక్టర్ ఛాంబర్ నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వారు ప్రవేశపెట్టిన డోర్ డెలివరీ సౌకర్యానికి సంబంధించిన బ్యానర్‌ను, కరపత్రాలను సంబంధిత అధికారులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎ.పి.ఎస్. ఆర్.టి.సి. ప్రజలకు మరింత చేరువగా కార్గో సేవలను అందించుటకు డోర్ డెలివరి సౌకర్యాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తూ తిరుపతి జిల్లాలోని పలు ప్రదేశాల్లో అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. 50 కేజీల బరువు వరకు బుకింగ్ చేసిన 'డోర్ డెలివరి' పార్సల్, కొరియర్లను వినియోగదారుని ఇంటి వద్దకు నేరుగా చేర్చబడతాయని తెలిపారు. పార్సల్ కౌంటర్ నుండి 10 కిలోమీటర్ల పరిధిలో ఈ "డోర్ డెలివరి" సేవలను అందించబడతుందని అన్నారు. ప్రస్తుతం తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి, తిరుపతి, వెంకటగిరి, పుత్తూరు లలో అందుబాటులో ఉన్నవని, ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని తెలిపారు. తిరుపతి డిపో మేనేజర్ బాలాజీ, బస్ స్టేషన్ మేనేజర్ డిఆర్ నాయుడు పాల్గొన్నారు.

కొండూరులో ఆక్రమణలు తొలగించండి

తహశీల్దార్‌ను హెచ్చరించిన కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తడ మండలం కొండూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 148లో 6.65 ఎకరాల గుంట పోరంబోకు భూమిని దేవుని పేరుతో కొందరు కబ్జా చేస్తున్నారని, ఆక్రమణలను వెంటనే తొలగించాలని గ్రామానికి చెందిన యువకులు కలెక్టర్ దృష్టికి సిపిఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు నేతృత్వంలో కలెక్టరేట్‌లో కలిసి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన కలెక్టర్ తహశీల్దార్‌ను ఫోన్ ద్వారా హెచ్చరించారు. 'గతంలోనే తెలియజేశానని, వెంటనే ఆక్రమణలు తొలగించాలని, మీరు చేయకపోతే ఎవరు చేస్తారు, ఎందుకలా చేస్తున్నారు'అని మందలించారు. వారం రోజుల్లో తొలగించకపోతే తానే స్వయంగా కార్యరంగంలోకి దిగాల్సి వస్తుందన్నారు. గ్రామస్తులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. గుంట పోరంబోకు భూముల్లో ఎటువంటి ఆక్రమణలు జరగకుండా చూడటం రెవెన్యూ బాధ్యతని తెలిపారు. వి.నాగరాజు మాట్లాడుతూ ఐదు నెలలుగా గ్రామస్తులు ఆక్రమణల విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి స్పందన లేదన్నారు. కలెక్టర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర, గ్రామస్తులు రమణ, మన్మథ, శంకర్ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు కొండూరు గ్రామస్తుల వినతి

కళ్యాణి డ్యామ్ నీటి మట్టం పరిశీలన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి నగరానికి తాగునీరు అందించే కల్యాణి డ్యామ్ నీటి మట్టాన్ని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య శుక్రవారం ఇంజినీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. కళ్యాణి డ్యామ్ 900 ఎంసిఎఫ్‌టి సామర్థ్యం కలిగి ఉందని, ప్రస్తుతం 310 ఎంసిఎఫ్‌టిల నీటిమట్టం ఉందని, ఇన్ ఫ్లో , ఔట్ ఫ్లో తదితర విషయాలను ఇంజినీరింగ్ అధికారులు కమిషనర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలని అన్నారు. ప్రస్తుతం ఉన్న నీరు ఆరు, ఏడు నెలల వరకు సరఫరా అయ్యే అవకాశం ఉందని అన్నారు. వర్షపునీరు పెద్ద ఎత్తున కల్యాణి డ్యామ్ కు చేరితే ప్రజలకు ఇబ్బందులు ఉండవని అన్నారు. కళ్యాణి డ్యామ్ నుండి నీరు సరఫరా అయ్యే పైప్ లైన్లు ఎప్పటికప్పుడు పరిశీలించాలని, ఎక్కడ నీరు వధా కాకుండా చూడాలని అన్నారు. ఎక్కడైనా పైప్ లైన్ మరమ్మత్తులు ఉంటే చేయించాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట మునిసిపల్ ఇంజినీర్ గోమతి, డి.ఈ. మధుకుమార్ ఉన్నారు.





ఘనంగా అమర రాజా వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి - రేణిగుంట

అమరరాజా 39వ వ్యవస్థాపక దినోత్సవాన్ని రెండు బిలియన్ డాలర్ల బహుళజాతి సంస్థ అమరరాజా గ్రూప్ సంతోషంగా జరుపుకుంది. 1985లో అమరరాజా పవర్ సిస్టమ్స్‌గా కార్యకలాపాలను ప్రారంభించిన గ్రూప్ ఇపుడు ఆరు కంపెనీలు, 17 వ్యాపారాలు, 18,500 మంది ఉద్యోగులతో అభివృద్ధి చెందింది. పబ్లిక్ స్పీకర్, ఎంఐటి మొదటి అంతర్జాతీయ అంధ విద్యార్థి బొల్లా శ్రీకాంత్‌తన స్ఫూర్తిదాయకమైన ప్రయాణాన్ని వివరిస్తూ ఉద్యోగులకు ప్రేరణ కల్పించారు. ఈ కార్యక్రమంలో ముగ్గురు గ్రామీణ పారిశ్రామికవేత్తలను ఎంపిక చేసి వారికి, మూడు లోల నగదు బహుమతిని అమరరాజాకు చెందిన మార్కెటింగ్, హెచ్‌ఆర్, ఫైనాన్స్ సప్లై చెయిన్ సిఎక్స్‌ఒలతో ఏడాదిపాటు మెంటర్‌షిప్ అందిస్తారు. అమరరాజా గ్రూప్ ఛైర్మన్ గల్లా జయదేవ్, వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ రామచంద్రనాయుడు, గల్లా అరుణకుమారి, డాక్టర్ రమాదేవి గౌరినేని హర్షవర్ధన్ గౌరినేని, విక్రమాదిత్య గౌరినేని, సిద్ధార్థ గల్లా పాల్గొన్నారు.

ఆవిష్కరణలకు ఏపీ దిక్సూచి : సిఐఐ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఆవిష్కరణకు ఎల్లప్పుడూ ఆంధ్రప్రదేశ్ దిక్సూచిగా ఉంటుందని సిఐఐ ఛైర్మన్ డాక్టర్ వి.మురళీకృష్ణ అన్నారు. తిరుపతి హోటల్ తాజ్‌లో సిఐఐ ఆంధ్రప్రదేశ్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ కాన్‌క్లేవ్‌లో దార్శనిక నాయకులు, ఆవిష్కర్తలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పాల్గొని సుస్థిర వృద్ధికి ఉన్న అవకాశాలను అన్వేషించారు. వి.మురళీకృష్ణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణలకు దిక్సూచిగా నిలిచిందని, అపారమైన ప్రతిభ, వనరులను ఉపయోగించు కుంటుందన్నారు. ఐఐటి తిరుపతి డైరెక్టర్ ప్రొఫెసర్ కెఎన్ సత్యనారాయణ ఈ సదస్సుకు బలమైన సందర్భాన్ని అందించారు. ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో విద్యావేత్తలు కీలకపాత్రని నొక్కి చెప్పారు. బలమైన ఎకోసిస్టమ్స్, స్టార్టప్ లకు తిరుపతిలో ఉన్న ప్రయోజనాలను ఆయన నొక్కి చెప్పారు. సీఐఐ తిరుపతి జోన్ ఛైర్మన్ పుష్పిత్ గార్గ్ మాట్లాడుతూ ఆర్థిక వద్ధి, సాంకేతిక పురోగతిని నడిపించే జంట ఇంజిన్లు ఇన్నోవేషన్, ఎంటర్ప్రెన్యూర్షిప్ అని పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివద్ధి లక్ష్యాలతో అనుసంధానం చేస్తూ తిరుపతి, ఆంధ్రప్రదేశ్ లలో ఉన్న అవకాశాలను సీఐఐ ఆంధ్రప్రదేశ్ మాజీ ఛైర్మన్ విజయ్ నాయుడు గల్లా వివరించారు.



దీర్ఘకాలిక సెలవుపై ట్రాన్స్‌కో ఏఈ బాలాజీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

తొట్టంబేడు మండల ట్రాన్స్‌కో ఏఈ బాలాజీ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. తొట్టంబేడులో జరుగుతున్న రెవెన్యూ సదస్సుల సందర్భంగా ఆయనపై ప్రజల నుంచి పలు ఫిర్యాదులు వెళ్లాయి. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ట్రాన్స్ కో ఏఈపై సీరియస్ అయ్యారు. దీంతో విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించడాన్ని తీవ్రంగా పరిగణించిన ట్రాన్స్ కో ఎస్ఈ సురేంద్ర నాయుడు ఏఈ బాలాజీని సెలవుపై వెళ్ళాల్సిందిగా ఆదేశించారు. ఆ మేరకు ఆయన్ను ఇక్కడ నుంచి రిలీవ్ చేసినట్లు శ్రీకాళహస్తి ట్రాన్స్ కో ఏడీఈ సుధాకర్ తెలిపారు.

నేడు తిరుపతిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి- తిరుపతి సిటి

నగరంలోని పలు ప్రాంతాలలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎపిఎస్‌పిడిసిఎల్ ఆపరేషన్ ఇఇ విన్నకోటి చంద్రశేఖర్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. స్విమ్స్, బర్డ్, రుయా మెడికల్ కళాశాల, సంజయ్‌గాంధీనగర్, మారుతీనగర్, న్యూ మున్సిపల్ ఆఫీసు ప్రాంతాల్లో 11 కెవి లైన్లు, ఎల్‌టి లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, ట్రీ కటింగ్ ఉంటుందని తెలిపారు. ఉదయం9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

25న శ్రీవాణి టికెట్లు ఆన్‌లైన్‌లో విడుదల

ప్రజాశక్తి - తిరుమల

వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని జనవరి 10 నుండి 19 వరకు పది రోజుల వైకుంఠ ద్వార దర్శనం భక్తులకు కల్పించనుంది. ఈ నేపథ్యంలో డిసెంబరు 25వ తేదీ ఉదయం 11 గంటలకు మార్చి నెల శ్రీవాణి టికెట్ల కోటాను విడుదల చేయనున్నారు. డిసెంబరు 26వ తేదీ ఉదయం 11 గంటలకు మార్చి నెల ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను విడుదల చేయడం జరుగుతుంది. అదే రోజు సాయంత్రం 3 గంటలకు తిరుమలలోని వసతి గదుల కోటాను విడుదల చేస్తారు. ఈ మార్పును గమనించి టికెట్లను బుక్ చేసుకోవాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు.

వ్యవసాయ కూలీ ఆత్మహత్య



ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ

తిరుపతి జిల్లా బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని వేణుగోపాలపురం పంచాయతీకి చెందిన మునిస్వామి కుమారుడు యేసు దయాల్ (35) అప్పుల బాధ తట్టుకోలేక వారం రోజుల క్రితం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అతనిని తిరుపతి రుయాస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం ఆస్పత్రిలో మృతిచెందాడు. అతనికి భార్య, కుమార్తె ఉన్నారు. యేసు దయాల్ వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తుండేవాడు. ఇటీవల ఒక ఎకరా పొలం లీజుకుని తీసుకుని వ్యవసాయం చేశాడు. ప్రస్తుతం కురుస్తున్న తుపానుకు వరద కారణంగా ఎకరా పొలం పూర్తిగా మునిగిపోయింది. దిక్కుతోచక యేసు దయాల్ బలవన్మరణానికి పాల్పడ్డాడని గ్రామస్తులు తెలిపారు. పేద కుటుంబానికి ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు పేర్కొన్నారు.

అమిత్ షా వ్యాఖ్యలు

అమానుషం



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

అంబేద్కర్ నిజాయతీ, క్రమశిక్షణకు మారుపేరుగా జీవించారని, అటువంటి వ్యక్తిపై బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నానని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ తెలిపారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాధారణ కుటుంబంలో పుట్టిన అంబేద్కర్ తన చదువుతో అపార తెలివితేటలను సొంతం చేసుకున్నారన్నారు. భారత రాజ్యాంగాన్ని లిఖించడానికి మహాత్మా గాంధీ కోరిక మేరకు అప్పటి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ సూచనతో ఆ భాధ్యతను తీసుకున్నారన్నారు. అయనకు తోటి సభ్యులు సహకరించక పోయినా ప్రపంచంలో ఎక్కడా లేని రాజ్యాంగాన్ని మన దేశ ప్రజలకు అంబేద్కకర్ అందించారన్నారు. పార్లమెంట్ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీపై కేసు నమోదు చేయడం దారుణమన్నారు. కాంగ్రెస్ ఈ సమావేశంలో యార్లపల్లి గోపి, తేజోవతి, వెంకటేష్, రవి, పటేల్, కుమార్ పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్‌లో కెవిపిఎస్, అంబేద్కర్ ట్రస్టు, డిహెచ్‌పిఎస్, దళితసంఘాల నాయకుల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అమిత్‌షాను వెంటనే కేంద్ర క్యాబినెట్‌నుంచి బహిష్కరించాలని డిమాండ్‌చేశారు. శుక్రవారం సాయంత్రం అంబేద్కర్ ట్రస్టు భవన్ నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకూ ర్యాలీగా వెళ్లి అంబేద్కర్ విగ్రహం దగ్గర నిరసన తెలిపారు. అపరంజి, కుప్పయ్య, డి.మహేష్, ఆర్.వెంకటేష్, డాక్టర్ గుణశేఖర్, వడివేలు, చిరంజీవి పాల్గొన్నారు.



గూడూరు ఆర్టీసీ డిపో ఎదుట కొనసాగుతున్న దీక్ష

కార్మికులపై కక్షసాధింపా : ఎస్‌డబ్ల్యుఎఫ్

ప్రజాశక్తి - గూడూరు టౌన్

గూడూరు ఆర్టీసీ డిపో పరిధిలో కార్మికులపై మేనేజర్ కక్షసాధింపు ధోరణిని నిరసిస్తూ ఎస్‌డబ్లుఎఫ్ ఆధ్వర్యంలో చేస్తున్న రిలే నిరాహారదీక్ష శుక్రవారానికి తొమ్మిదోరోజుకు చేరుకుంది. దీక్షల్లో డిపో కమిటి ఉపాధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి ఎం.గురవయ్య కూర్చున్నారు. నాయకులు కెఎస్ వాసులు మాట్లాడుతూ తాము చేస్తున్న దీక్ష ఉద్యోగులకు వ్యతిరేకం కాదని, డిపో మేనేజర్ అవలంభించిన విధానాలపై జరుగుతోందన్నారు. డిపో మేనేజర్ వివక్షాపూరిత వైఖరిని అందరూ ఖండించాలన్నారురర. ఈ కార్యక్రమంలో సి.హెచ్.రాము, ఎస్.ఎస్.వి.కష్ణ, పి.కిరణ్, కే.కష్ణయ్య, సి.ఐ.టి.యు గూడూరు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బి.వి.రమణయ్య, ఎస్.సురేష్ పాల్గొన్నారు.

ఎస్వియూలో చిరుత కలకలం

విద్యార్థుల భయాందోళన

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్వీయూలో శ్రీనివాస ఆడిటోరియం పరిసర ప్రాంతాలలో శుక్రవారం ఉదయం ఐదున్నర గంటల సమయంలో చిరుత సంచరిస్తూ విద్యార్థుల కంటపడి కలకలం సృష్టించింది. దీంతో భయాందోళనకు గురైన విద్యార్థులు వెంటనే వర్సిటీ ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఈ సమాచారం తెలుసుకున్న వర్సిటీ వీసీ, రిజిస్ట్రార్లు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లకు, పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో చిరుత సంచరించిన ప్రాంతానికి రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టరు పాకనాటి హరికృష్ణతో ఫారెస్ట్ రేంజర్‌కి చెందిన బయాలజీస్టులు చేరుకుని చిరుత పాదముద్రలు పరిశీలించి, వాటి చిత్రాలను నమూనాలను ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లకు పంపారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ అధికారులు మాట్లాడుతూ చిరుత సాధారణంగా జింకలు, కుక్కలు వేటాడడానికి వస్తుంటాయని తెలిపారు. ముఖ్యంగా కుక్కల కోసం జనవాసాల్లోకి చిరుతలు వస్తుంటాయని, ఆ సమయంలో జాగ్రత్తగా ఉండడం మంచిదన్నారు. కుక్కలకు ఆహారాన్ని అందించే వారకు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో కెమెరాలు ఏర్పాటు చేశామని, విజువల్స్ దొరికితే ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం బోన్ ఉంచి చిరుతను బంధిస్తామని తెలిపారు. ఈ ఘటనపై రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు వెంటనే స్పందించి ఫారెస్ట్ ఆఫీసర్ల సూచనల మేరకు రాత్రి 8 గంటల నుంచి ఉదయం 6.30 గంటల వరకు విద్యార్థిని, విద్యార్థులు కళాశాల హాస్టల్స్‌లో ఉండాలని, వర్సిటీలో తిరగకూడదని, ఆహార పదార్థ వ్యర్థాలను సక్రమంగా నిర్వహించాలని, ముఖ్యంగా కుక్కలకు అందుబాటులో ఉండకుండా చూడాలని ప్రిన్సిపల్స్‌కూ, హాస్టల్ వార్డెన్లకు, హాస్టల్ వర్కర్లకు, క్యాంటీన్ల యాజమాన్యానికి, వర్సిటీ రోడ్లపై చిన్న చిన్న తోపుడు బండ్లు కూడా ఉంచొద్దని, వర్సిటీలో బయటి వ్యక్తులకు ఎస్వీయు ఐడి కార్డ్ లేకుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సెక్యూరిటీ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.


చిరుత పాద ముద్రలు సేకరిస్తున్న ఫారెస్ట్ అధికారులు

మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధే లక్ష్యం: కలెక్టర్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మహిళలు ఆర్థిక, సామాజిక రంగాలలో అభివృద్ధి చెందడమే లక్ష్యమని తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. శుక్రవారం టిటిడిని కార్యాలయంలో తిరుపతి జిల్లా సమాఖ్య సర్వసభ్య సమావేశం రెండవ వార్షిక సమావేశానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సీఎం చంద్రబాబు నాయుడు ఆశయాల ఆయిన వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్ ప్రెన్యూర్ ముఖ్యమంత్రి ఆశయాల కనుగుణంగా ప్రతి కుటుంబం నుండి ఒక ఔత్సాహిక పారిశ్రామిక వేత్తను తయారు చేయాలన్న లక్ష్యాలకు అనుగుణంగా స్వయం సహాయక సంఘాల సభ్యులు చేతి వృత్తులపైన కాకుండా వివిధ రంగాలలోనూ అవకాశాలను అందిపుచ్చుకొని పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని కలెక్టర్ సూచించారు. మహిళా సంఘాల సభ్యులు ఇప్పుడున్న పురోగతికి మరింత శ్రమిస్తే అత్యుత్తమ ఫలితాలను సాధించి ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తారన్నారు. 1995లో నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు పొదుపు సంఘాలు ఏర్పాటు చేసి 30 సంవత్సరాలు అవుతోందని, ముఖ్యమైన సమావేశాలు నిర్వహించేటప్పుడు సంఘం సభ్యులు ఆ సమావేశాలకు హాజరై వాటి ప్రాధాన్యతను గుర్తించాలని, సీఎం మహిళలను డ్రోన్ దీదీలుగా ఎదగాలని వాటి వినియోగం చేసేలా మహిళా సంఘాలకు శిక్షణ ఇచ్చి టెక్నాలజీ వరంగా తీర్చిదిద్దుతున్నారు. పిఎం సూర్య ఘర్ పథకాన్ని ప్రతి మహిళా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని, వారి మిద్దెపై రూఫ్ టాప్ సోలార్ ప్యానల్లు ఏర్పాటు చేసుకుని, తద్వారా సౌర విద్యుత్ పొందవచ్చని, వీటి ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం తగిన సబ్సిడీని అందిస్తుందన్నారు. తీసుకున్న బ్యాంకు రుణాలను సకాలంలో చెల్లిస్తే స్టేట్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంకులు విరివిగా రుణాలు అందిస్తున్నారు. డిఆర్‌డిఎ పీడీ శోభన్ బాబు మాట్లాడుతూ తిరుపతి జిల్లాలోని జిల్లా సమాఖ్యలో మార్చి 31, 2024 నాటికి 34,040 మహిళా సంఘాలలో 3,40,754 మంది సంఘ సభ్యులు కలిగి 1283 గ్రామ సంఘాలు ఉన్నాయని 34 మండల సమాఖ్యల యొక్క సభ్యత్వం కలిగి ఉంటాయన్నారు. ఈ సందర్భంగా జిల్లా నూతన సమాఖ్య కార్యవర్గాన్ని ఎన్నుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్డీఎం విశ్వనాధ్ రెడ్డి, డిపిఎం వెంకటేష్, జిల్లా సహకార శాఖ అధికారిని లక్ష్మీ, వెలుగు ఏపీఎం ప్రభావతి, ఏపీఎస్ఎస్డిసి అధికారి లోకనాథం, మండల సమాఖ్య స్వయం సహాయక సంఘాల లీడర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

విద్యుత్ దీపాలు ఏర్పాటు


ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసిన విద్యుత్ శాఖాధికారులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : తిరుపతి –చెన్నై జాతీయ రహదారిపై తరచుగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ ప్రమాదాల్లో అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. రాత్రి వేళల్లో రోడ్డు దాటడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని పాదిరేడు పరిసర గ్రామ ప్రజలు నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ దృష్టికి తెచ్చారు. హైమాక్స్ లైట్స్ ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించాలని ఎమ్మెల్యే ఎన్‌హెచ్, విద్యుత్ అధికారులను ఆదేశించారు. ఎన్‌హెచ్ సిబ్బంది లైట్లు ఏర్పాటు చేసేందుకు అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్‌ను వడమాలపేట విద్యుత్ శాఖ ఏర్పాటు చేసింది. దీంతో ఎమ్మెల్యే స్పందనపై ప్రజలు హర్షం వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలిపారు.

పకడ్బందీగా సమ్మిట్-1 పరీక్ష

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో పకడ్బందీగా సమ్మిట్–1 పరీక్షను నిర్వహిస్తున్నామని ఎంఈఓ మునిసుబ్రహ్మణ్యం తెలిపారు. బుధవారం బుచ్చినాయుడు కండ్రిగలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమ్మిట్–1 పరీక్షను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబరులో సమ్మిట్–1, ఫైనల్ ఏప్రిల్‌లో సమ్మిట్–2 పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థులు బాగా చదివి సమ్మిట్ పరీక్షలు రాయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిల్లల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: బడి ఈడు పిల్లలు మండలంలో వీధుల్లో తిరుగుతున్న పిల్లలను గుర్తించిన పోలీసులు వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. బడి ఈడు పిల్లలను బడిలో చదివించాలని వారికి హితవు పలికారు. మండలంలో తిరుగుతున్న పలువురి విద్యార్థులను, పెద్ద పాలివేడుకు చెందిన ఇద్దరు పిల్లలను బుచ్చినాయుడు కండ్రిగ ఎస్ఐ విశ్వనాథ నాయుడు గుర్తించి వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. చదువుకునే వయసు ఉన్న పిల్లలను విచ్చలవిడిగా వదిలేయడం మంచిది కాదని, వారికి తల్లిదండ్రులు ఉజ్వల భవిష్యత్తును అందించాలని కోరారు. చదివిస్తేనే భవిష్యత్తులో వారు ఉన్నత స్థాయిలో ఉంటారని సూచించారు. తర్వాత పిల్లలకు చదువుకోవాలని కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహిళా వర్సిటీలో సెలెస్ట్రా

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల ఈవెంట్, సెలెస్ట్రా – 25 పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం జనవరి 28, 29న నిర్వహించే ఈ కార్యక్రమంలో యువ ఆవిష్కర్తలు తమ ఆలోచనలను ప్రదర్శించడానికి, సహకార అభ్యాసంలో పాల్గొనడానికి, సాంకేతికతలో పురోగతికి దోహదపడేందుకు ఒక వేదికగా ఉంటుందని విసి ఆచార్య ఉమ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ రజని, ఆచార్య పి మల్లికార్జున, ఆచార్య వి సరిత, ఎన్ సాయి లోహిత, బి లక్ష్మీదేవి, కో కన్వీనర్, విద్యార్థి కన్వీనర్లు పాల్గొన్నారు.

దౌర్జన్యంగా ఇళ్లను కూల్చారు: మునయ్య

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం) : దళితులకు 1971లో ఇందిరా గాంధీ ప్రభుత్వం ఏక్ సాల్ లీజ్ ద్వారా భూమిని కేటాయించారని, ఆనాటి నుండి నేటి వరకు భూమిని సాగు చేసుకుంటూ అదే భూమిలో ఇళ్లను నిర్మించుకుంటే రెవెన్యూ, పోలీసు అధికారులు తెల్లవారుజామున పెద్ద ఎత్తున వచ్చి కూల్చివేశారని బాధితులు మునయ్య, మునస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతి రూరల్ మండల పరిధిలోని వేదాంతపురం పంచాయతీ, వినాయక నగర్ లో చోటుచేసుకున్న ఈ ఘటనపై అక్కడి దళిత సామాజిక వర్గానికి చెందినవారు అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం పంచాయతీ అవిలాల గ్రామ రెవెన్యూ లెక్క దాఖలాలో సర్వేనెంబర్ 513/16 ఎకరా స్థలం, 513/19లో ఎకరా 40 సెంట్ల స్థలంకు 1976లో ప్రభుత్వం పట్టాలను మంజూరు చేసిందన్నారు. ప్రతి ఏడు భూమిని సాగు చేసుకుంటూ, రెన్యువల్ చేసుకుని తమ ఆధీనంలో ఉన్న స్థలంలో ఇళ్లను నిర్మించుకుంటే రెవెన్యూ అధికారులు వేకువ జామున వచ్చి పోలీసు బలగాలతో ఇళ్లలో నిద్రిస్తున్న తమను బయటకు లాగి వేశారని, మొబైల్ ఫోన్లను బలవంతంగా తీసుకొని వారి వద్ద ఉంచుకున్నారని ఆరోపించారు. దళితుల భూమిని ఆక్రమించేందుకు కొందరు కుట్ర పన్నుతున్నారని, అందుకే తమని ఇక్కడి నుండి వెళ్లగొట్టడానికి ఇళ్లను కూల్చి వేశారని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

క్యాట్ ఫలితాల్లో 'కౌటిల్య' విద్యార్థుల ప్రతిభ


ఎమ్. మోక్షజ్ఞ పెర్సెంటైల్:93.38 | భవ్యశ్రీ నిషిత పెర్సెంటైల్:92 | జి.వంశీ యాదవ్ పెర్సెంటైల్:90.93

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): దేశ వ్యాప్తంగా జాతీయ స్థాయి క్యాట్ ఫలితాలలో తిరుపతి నగర పరిధిలోని ఎంఆర్‌పల్లి వద్ద ఉన్న కౌటిల్య ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన పది మంది విద్యార్థులు జాతీయ స్థాయి టాప్ స్కోర్ సాధించారని డైరెక్టర్ శ్రీధర్ తెలిపారు. జాతీయ స్థాయిలో మట్టం మోక్షజ్ఞకు 93.38 పెర్సెంటైల్ స్కోర్, భవ్య శ్రీనిషిత 92, జి వంశీ యాదవ్ 90.93, కె హారిక రాజు 85, పి శ్రీనిధి– 83.7 పెర్సెంటైల్ స్కోర్లు సాధించారన్నారు. క్యాట్ కోసం లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకున్న వీరందరూ మంచి పెర్సెంటైల్ స్కోర్స్ సాధించడం పట్ల ఫ్యాకల్టీ హరి, సీనియర్ మేనేజర్ ఎస్ఎస్ రెడ్డి ప్రత్యేకంగా విద్యార్థులను అభి నందించారు.

అంతర్ విశ్వవిద్యాలయాల ఫుట్ బాల్ టోర్నమెంట్‌కి 'అంగ్రూ' జట్టు

ప్రజాశక్తి - క్యాంపస్ : ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం (అంగ్రూ) ఫుట్ బాల్ జట్టు ఈనెల 21 నుంచి కేరళలోని కాలికట్ యూనివర్సిటీలో నిర్వహించనున్న దక్షిణ భారతదేశ అంతర విశ్వవిద్యాలయాల ఫుట్ బాల్ టోర్నమెంట్‌కు ఎంపికైంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ వ్యవసాయ కళాశాలలకు చెందిన విద్యార్థులతో కూడిన ఫుట్ బాల్ జట్టుకు తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల ఆవరణలో ఈనెల 16 నుంచి విశ్వవిద్యాలయం అధికారులు ప్రత్యేక శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యాయామ విభాగాధిపతి డాక్టరు రవికాంత్ రెడ్డి పర్యవేక్షణలో శిక్షణ పూర్తి చేసుకున్న జట్టు విద్యార్థులకు శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టరు ఎంవి రమణ చేతుల మీదుగా క్రీడా దుస్తులు, ఇతర క్రీడా వస్తువులు అందించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయ ఫుట్ బాల్ జట్టు దక్షిణ భారతదేశ స్థాయి అంతర విశ్వవిద్యాలయాల ఫుట్ బాల్ టోర్నమెంట్‌లో విజయం సాధించాలని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టరు ఎంవి రమణ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో మేనేజర్ ఎ పురుషోత్తం రావు, టీం కోచ్ ఎం విజయ్ పాల్గొన్నారు.


రోగుల ఆరోగ్యాన్ని తెలుసుకుంటున్న జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి శ్రీనివాసులు

మెరుగైన వైద్య సేవలు అందించండి

జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి డాక్టరు శ్రీనివాసులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి డాక్టరు శ్రీనివాసులు పేర్కొన్నారు. మండల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, చెన్నూరు , నెర్నూరు ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఆయన సందర్శించారు. గ్రామంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు వివరించారు. గర్భిణులు , బాలింతల ఆరోగ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. వారు తీస్కోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. చిన్నారులకు ఆరోగ్యంపై సూచనలు, సలహాలు ఇచ్చారు. పలు రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం సచివాలయం వారిగా వైద్య సిబ్బందితో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డిపిఎంవో డాక్టర్ శ్రీనివాసులు , డాక్టర్ లీలాకృష్ణ, ఎస్‌వో నాగేంద్ర కుమార్, సూపర్ వైజర్ నరేష్ బాబు , డిపివో ప్రకాష్, ఎన్ అరుణ, జి నాగేశ్వర రెడ్డి పాల్గొన్నారు.


రోగుల ఆరోగ్యాన్ని తెలుసుకుంటున్న జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి శ్రీనివాసులు

పెరటి కోళ్లతో ఆర్థికాభివృద్ధి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: వన రాజా జాతికి చెందిన పెరటి కోళ్లను పెంచుకోవడం ద్వారా ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధిని సాధిస్తుందని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషితా రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి మండలం ఊరందూరు దళితులకు శుక్రవారం శ్రీవెంకటేశ్వర పశు వైద్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఎస్సీ సబ్ ప్లాన్ కింద భారత వ్యవసాయ పరిశోధన మండలి సహకారంతో పెరటి కోళ్ల శుక్రవారం పంపిణీ చేశారు. వాటితో పాటు దాణా, మందులు, నీటి సరఫరా పరికరాలు అందించారు. రూ.4 వేలు విలువైన యూనిట్‌లను 30 మంది రైతులకు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన బొజ్జల రిషిత రెడ్డి మాట్లాడుతూ శాస్త్రవేత్తల పరిశోధనా ఫలాలు రైతులకు చేరడం అభినందనీయమన్నారు. పెరటి కోళ్లను పెంచడం వల్ల పోషకాహారంతో పాటూ కుటుంబానికి అదనపు ఆదాయం లభిస్తుందన్నారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు శ్రీకాళహస్తి నియోజక వర్గంలో చేపట్టడానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. పశు వైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి జగపతి రామయ్య, ప్రొఫెసర్ రాంబాబు నాయక్, శ్రీకాళహస్తి పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎన్వీ శ్రీకాంత్ బాబు, ఊరందూరు డాక్టర్ ఊహ, ప్రొఫెసర్లు గంగరాజు, షకీలా, విజయభాస్కర్, వెంకటేశ్వర్లు, తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.


నీటి సరఫరా పరికరాలు అందిస్తున్న ఎమ్మెల్యే సతీమణి బొజ్జల రిషితారెడ్డి

ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు అవగాహన

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ బ్యూరో యూనిట్ 3, 13, యూనివర్సిటీ హెల్త్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు మెన్స్ట్రువల్ హైజిన్ అండ్ మేనేజ్‌మెంట్ అంశంపై శుక్రవారం అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్విమ్స్ గైనకాలజిస్ట్ డాక్టర్ ప్రవల్లిక సుధారాణి ముఖ్య అతిథిగా హాజరై మెనస్ట్రువేషన్ సంబంధిత ముఖ్యమైన అంశాలను విద్యార్థులకు వివరించారు. మెనస్ట్రువేషన్ గురించి సరైన అవగాహన కలిగి ఉండటం, మూఢనమ్మకాల నుండి బయట పడటం, హైజీన్ పట్ల శ్రద్ధ వహించడం ద్వారా మహిళలు మంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని స్పష్టం చేశారు. మెనస్ట్రువల్ హైజీన్ తప్పని సరిగా పాటించాల్సిన అంశాలను ప్రస్తావిస్తూ శానిటరీ ప్యాడ్‌లు, లేదా మెనస్ట్రువల్ కప్పులను ప్రతి 4, 6 గంటలకు మార్చాలని, ఐరన్, ప్రోటీన్ వంటి పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని, స్ట్రెస్ లేకుండా ఉండాలని, సులభ వ్యాయామాలు చేసుకోవడం ద్వారా, గోరు వెచ్చని నీటితో శుభ్రంగా స్నానం చేయడం ద్వారా ఈ సమయంలో వచ్చే అసౌకర్యాన్ని అధిగమించవచ్చన్నారు. పిరియడ్స్ సమయంలో రక్తస్రావం అసాధారణంగా చాలాఎక్కువగా ఉండటం, చెడు వాసన రావడం, లేదా తీవ్రమైన నొప్పి ఉంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ హెల్త్ సెంటర్ మెడికల్ కన్సల్టెంట్ డాక్టరు పద్మావతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిణులు డాక్టరు సుజాత, డాక్టరు నీరజ, విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: స్విమ్స్, శ్రీ బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో బిఎన్ కండ్రిగ పిహెచ్‌సి పరిధిలోని ఆర్ అనంతపురం విలేజ్ హెల్త్ సెంటర్, ఆర్ అనంతపురం ఎంపిపి పాఠశాలలో ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు శుక్రవారం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా నిర్వహిస్తున్నారు. పింక్ బస్సులో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ కోసం మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కోసం పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. ఈ శిబిరాల్లో మహిళలు, పురుషులు అధిక సంఖ్యలో పాల్గొని క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో బిఎన్ కండ్రిగ పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ దివాకర్, డాక్టర్ విద్యాసాగర్, స్విమ్స్ శ్రీ బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ పద్మావతి, డాక్టర్ చైతన్యభాను, సిహెచ్‌ఓ డిఎన్ వెంకటేశులు, సర్పంచులు జె రమణమ్మ, వెంకటస్వామి, పంచాయతీ కార్యదర్శులు మునికృష్ణయ్య, ఆనంద్ బాబు, స్థానిక నాయకులు గోపాల్ రెడ్డి, చలపతి, దామోదర్, ఎంఎల్ హెచ్‌పిలు కె ప్రసన్న, జి ప్రియాంక, ఏఎన్ఎంలు సి శ్రీదేవి, వి శారదమ్మ, స్థానిక వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్‌లు నిర్వహిస్తున్న వైద్యులు

జాతీయ సాంస్కృతిక కార్యక్రమాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సాంస్కృతిక కార్యక్రమాల పోస్టర్ ను బంజారా జన్ సాంగ్ వ్యవస్థాపక అధ్యక్షులు మూడే హరి చౌహన్ నాయక్ ఆధ్వర్యంలో తిరుపతి ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజనుల ప్రాముఖ్యతను తెలిపే వివిధ సాంస్కృతిక, సంప్రదాయ కట్టుబాట్లు, ఆచారాలు, వ్యవహారాలను తెలిపే ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ప్రాముఖ్యతను సత్కరించుకుంటాయన్నారు. గిరిజనుల ప్రాముఖ్యతను తెలిపే ఇలాంటి కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన ఆవశ్యకత వుందన్నారు. బంజారా జన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మూడే హరీష్ చౌహాన మాట్లాడుతూ గిరిజనుల సాంస్కృతిక, సంప్రదాయాలను కాపాడి భవిష్యత్తు తరాల కోసం అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. గిరిజనుల ఐక్యత కోసం, గిరిజనుల అభివృద్ధి కోసం రాష్ట్ర వ్యాప్తంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 27 ,28వ తేదీల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు రాజారెడ్డి, తిరుపతి నగరపాలక జనసేన లీడర్లు, వైస్ ప్రసిడెంట్ వెంకటేష్ నాయక్, గిరిజన నాయకులు పాల్గొన్నారు.


జాతీయ సాంస్కృతిక కార్యక్రమాల పోస్టర్ ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

చెరువును తలపిస్తున్న కలత్తూరు రోడ్డు

ప్రజాశక్తి- కెవిబిపురం: మండలంలోని కలత్తూరు గ్రామానికి వెళ్లే రహదారి చెరువును తలపిస్తోంది. రోడ్డుపై నీరు నిల్వ ఉండటం వల్ల దోమల బెడద ఎక్కువగా వుంది. దీంతో విషజ్వరాలు ప్రబలుతున్నాయి. ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. ఈ మార్గంలో ఎక్కువ వాహనాలు కార్మికులను తీసుకుని పరిశ్రమలకు వెళుతుంటారు. కొంతమంది ద్విచక్రవాహనాల్లో వెళుతుంటారు. అధికారులు స్పందించి ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రహదారి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. గత ప్రభుత్వ హయాంలోనూ అనేకమార్లు అర్జీలు ఇచ్చినా ప్రయోజనం లేకపోయిందని, కూటమి ప్రభుత్వం అయినా కనికరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


చెరువును తలపిస్తున్న కలత్తూరు గ్రామ రహదారి

10న వైకుంఠ ఏకాదశి పూజలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : శ్రీనివాసమంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో జనవరి 10న వైకుంఠ ఏకాదశి, 11న వైకుంఠ ద్వాదశి పర్వదినాల సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు టిటిడి పీఆర్‌ఓ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెండు పర్వదినాలను పురస్కరించుకుని టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ఆలయంలో ఆధ్యాత్మిక, భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహించనున్నారు.


టిడిపి శాశ్వత సభ్యత్వం స్వీకరిస్తున్న మధుబాబు

లక్ష చెల్లించి లక్కమనేని టీడీపీ సభ్యత్వం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : టిడిపి నేత లక్కమనేని మధుబాబు రూ.లక్ష చెల్లించి టిడిపి శాశ్వత సభ్యత్వం స్వీకరించారు. పట్టణంలోని 22వ వార్డు పరిధిలో శుక్రవారం టిడిపి సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్కమనేని మధు రూ.లక్ష చెల్లించి ఎమ్మెల్యే చేతుల మీదుగా టీడీపీ శాశ్వత సభ్యత్వ రశీదును అందుకున్నారు. అనంతరం మధుబాబు పనితీరు, సేవా భావాన్ని ఎమ్మెల్యే అభినందించారు.

తిరుపతిలో భక్త సమ్మేళన వేడుకలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఈ నెల 23 నుండి 25 వరకు తిరుచానూరు రోడ్డులోని శ్రీనివాస కళ్యాణ మండపంలో రామకృష్ణ, వివేకానంద భావ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో 6వ భక్త సమ్మేళన వేడుకలు నిర్వహిస్తున్నట్లు పరిషత్ అధ్యక్షుడు స్వామి సుకృతానంద తెలిపారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఆయన మాట్లాడారు. యువజన సదస్సుతో ఈ భక్త సమ్మేళన వేడుకలు ప్రారంభమవుతాయని, ఈ వేడుకలకు దేశంలోని ప్రముఖ రామకృష్ణ మఠం మిషన్లకు చెందిన స్వామీజీలు, మాతాజీలు విచ్చేసి తమ విలువైన ఆధ్యాత్మిక సందేశాలిస్తారన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పిచ్చాటూరు: గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. పిచ్చాటూరు మండలం రామగిరిలో రెవెన్యూ సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు తమ గ్రామాల్లో నిర్వహించే ఈ రెవెన్యూ సదస్సులకు హాజరై భూ సమస్యలు అధికారులకు అర్జీల రూపంలో విన్నవిస్తే నెల రోజుల్లో పరిష్కారం అవుతాయన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. అరణియార్ ప్రాజెక్టు ఈ ప్రాంత రైతులకు, మత్స్యకారులు, ప్రజలకు వరమని ఆయన పేర్కొన్నారు. గత ఆరేళ్లుగా ప్రతి ఏటా జలాశయం పూర్తి స్థాయిలో నిండడం వల్ల అన్నదాతలు, మత్స్య కార్మికులు సుభిక్షంగా ఉన్నారన్నారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, వంతెనలు మరమ్మతులు వేగవంతం చేయడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం పిచ్చాటూరు టిడిపి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి సభ్య నమోదు చేయాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ డీ ఇలంగోవన్ రెడ్డి, ఆయకట్టు సంఘం అధ్యక్షులు రవిరెడ్డి, పద్దు రాజు, టిడిపి నాయకులు వాసు రెడ్డి, భక్తా రెడ్డి, శ్రీనివాసులు, ప్రతాప్, రవి, ఢిల్లీ, దొరవేలు పాల్గొన్నారు.

దొరవారిసత్రం: భూ సమస్యలు పరిష్కారానికి చక్కటి వేదిక రెవెన్యూ సదస్సులు అని తహశీల్దారు శైలకుమారి పేర్కొన్నారు. మండలంలోని కట్టువపల్లిలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించి ప్రజల నుండి భూ సమస్యల అర్జీలు స్వీకరించారు. గతంలో పలు పర్యాయాలు భూ సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఈ సదస్సుల్లోనైనా పరిష్కరిస్తారని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేశారు.


మాట్లాడుతున్న సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

తహశీల్దార్ మాట్లాడుతూ ఈ సదస్సుల్లో అందించే భూ సమస్యలకు వెంటనే పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, సర్వేయర్ నాగరాజు, టిడిపి మండల నాయకులు ప్రసాద్ నాయుడు తోపాటు, ఆ గ్రామం నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

కేవిబిపురం: మండలంలోని కల్లూరు ఆదరం గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సు మండల తహశీల్దారు మునిరత్నం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు రాజారెడ్డి, మాధవరెడ్డి, శోభన్‌బాబు మాట్లాడు తూ ప్రజలు, రైతులు దీర్ఘకాలిక భూ సమస్యలను ఈ సదస్సుల్లో పరిష్కరించుకోవాలని కోరారు. అనంతరం వినతులు స్వీకరించారు. ఈ కార్యక్ర మంలో టిడిపి నాయకులు , జనసేన మండల అధ్యక్షుడు థామస్, మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని పెద్ద పాలివేడు చిన్నపాలివేడులో తహశీల్దారు ఐ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ గ్రామస్తులు శ్మశానికి దారి లేక మృతదేహాన్ని పంట పొలాలలో తీసుకెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని శ్మశానానికి దారి సౌకర్యం కల్పించాలని కోరారు. రైతులు పలు భూ సమస్యలపై వినతిపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో డీటీ చంద్రబాబు నాయుడు, ఆర్ఐ నల్లయ్య పాల్గొన్నారు.

రామచంద్రాపురం: మండలంలోని గంగిరెడ్డిపల్లి సచివాలయంలో తహశీల్దారు కే వెంకటరమణ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. అనంతరం రెవెన్యూ అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించి, ఆన్‌లైనులో నమోదు చేసి రసీదులు అందించారు. మొత్తం 101 అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకులు ఎం ఢిల్లీ నాథ్ రెడ్డి, రీ సర్వే డిప్యూటీ తహశీల్దారు అమృత, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, వీఆర్వోలు గాలి గునుభూషణ్ నాయుడు, శ్రీనివాసులు, రాజశేఖర్, బాబు, ఝాన్సీ రాణి, నరసింహులు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


రామచంద్రాపురంలో

పెళ్లకూరు: మండలంలోని నందిమాల గ్రామంలో రెవెన్యూ సదస్సును మండల టిడిపి అధ్యక్షుడు సంచి కృష్ణయ్య ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు ఎస్ ద్వారకానాథ్ రెడ్డి, మండల విఆర్‌ఓ రమేష్, వంశీ, ప్రసాద్ నాయుడు, సిద్ధిలయ్య, మండల నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గూడూరు టౌన్ : గూడూరు గాంధీ నగర్‌లో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ముఖ్య అతిథిగా ఎంఎల్‌ఏ సునీల్ కుమార్ , సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు తహశీల్దారు చంద్రశేఖర్ , పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు , రెండో పట్టణ ఎస్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

దేవాలయాలకు సైరన్ లాక్ ఉపయోగించాలి: సిఐ

ప్రజాశక్తి -దొరవారిసత్రం : 'ఎవరైనా సరే ఎక్కడికైనా ఇల్లు విడిచి వెళ్లాలంటే మీ ఇంటికి రాత్రి సమయంలో దేవాలయాలకు, దుకాణాలకు సైరన్ లాక్ (స్మార్ట్ లాక్)ను ఉపయోగించండి..' అని నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వర రావు అన్నారు. శుక్రవారం దొరవారిసత్రం పోలీస్ స్టేషన్లో దేవాలయ కమిటీ మెంబర్లకు, దుకాణదారులకు సైరన్ లాక్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ సంగమేశ్వర రావు మాట్లాడుతూ నేటి సమాజం ఎంత అభివృద్ధి చెందుతోందో దొంగలు కూడా వాళ్ల నైపుణ్యాన్ని కొత్త కొత్త టెక్నాలజీ తో ఇళ్లల్లో, గుడిలో దుకాణాలలో దొంగతనాలు చేస్తూ పోలీస్ సిబ్బందికే సవాల్ విసురుతున్నారన్నారు. గ్రామాలలో పలుచోట్ల దేవాలయంలో, దుకాణాలలో దొంగతనాలు జరుగుతున్నాయని, గ్రామాల్లో నివసిస్తున్న ప్రజలు ఎక్కడికైనా వెళ్లాలన్నా గృహాలకు సైరన్ లాక్ వేసి ఇంట్లో ఉన్న నగదు, బంగారు ఆభరణాలు భద్రపరుచుకోవాలని తెలిపారు. ఈ సైరెన్ లాక్ విలువ 400 రూపాయలు ఉంటుందని, ఈ లాక్‌ను ఇళ్లకు, దేవాలయాలకు, ఉపయోగించుకొని దొంగల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఎస్ఐ అజయ్ కుమార్ మాట్లాడుతూ దొరవారిసత్రం మండలంలోని దేవాలయాలకు, గృహాలకు ఇలాంటి సైరెన్ లాక్‌ను ఉపయోగించుకుని పోలీసులకు సహకరించాలని తెలిపారు.



సైరన్‌లాక్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: అనుమానాస్పద రీతిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన తొట్టంబేడు మండలంలోని బోనుపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. మృతుడి బంధువుల కథనం మేరకు..గ్రామానికి చెందిన జలగం ఆదెమ్మ కుటుంబంలో ఆస్తి తగాదాలున్నాయి. ఇటీవల బోనుపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఫిర్యాదులు కూడా చేసుకున్నారు. ఈ నేపథ్యంలో జలగం ఆదెమ్మ రెండో కుమారుడు జలగం మణి(52) శుక్రవారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అయితే మణిపై ఎవరో దాడి చేయడం వల్లే మృతి చెందినట్లుగా ఆయన తమ్ముడు ఆనంద్ ఆరోపించారు. రాజకీయ కక్షతోనే ఇలా చేశారన్నారు. ఈ విషయంపై తొట్టంబేడు ఎస్ఐ ఈశ్వరయ్యను వివరణ కోరగా తమకు మృతుడి బంధువుల తరపునుంచి ఇప్పటివరకు రాత పూర్వకంగా ఫిర్యాదు అందలేదని వివరణ ఇచ్చారు.

కోటిలింగేశ్వర స్వామి సేవలో అక్కినేని అఖిల్



కోటిలింగేశ్వర స్వామిని దర్శించుకున్న సినీ నటుడు అక్కినేని అఖిల్

ప్రజాశక్తి- రామచంద్రాపురం: మండలంలోని రాయల చెరువు కట్ట కింద ఉన్న శ్రీ కోటిలింగేశ్వర స్వామిని సినీ నటుడు అక్కినేని నాగార్జున తనయుడు, నటుడు అఖిల్, దర్శకుడు మురళీ కిషోర్ అబ్బూరులు శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన సినీ నటుడు అఖిల్, డైరెక్టర్ మురళీ కిషోర్ అబ్బూరులకు ఆలయ నిర్వాహకులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం శ్రీ కోటిలింగేశ్వర స్వామి, శ్రీ జలకంటేశ్వరస్వామి, శ్రీ కామాక్షి దేవి దర్శన ఏర్పాట్లు చేశారు. వారు స్వామి అమ్మవార్లకు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వారికి వేద ఆశీర్వచనం చేసి దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించి తీర్థ ప్రసాదాలు అందించారు. మండలంలోని కమ్మ కండ్రిక గ్రామానికి చెందిన మురళి కిషోర్ అబ్బూరు తన దర్శకత్వంలో తీసే సినిమాలకు ముందు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని, సినిమా తీయడం ఆనవాయితీ. అదే తరహాలో త్వరలో అక్కినేని అఖిల్ నటుడుగా, మురళి కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో తీసే సినిమా విజయవంతం కావాలని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు తంజావూరు మణి, అబ్బూరు దేవరాజుల నాయుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పంట బీమాను సద్వినియోగం చేసుకోవాలి: ఏవో

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: పంట బీమాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో భారతి సూచించారు. పొలం పిలుస్తోందిలో భాగంగా శుక్రవారం జంబుగోళం, గోవిందప్ప నాయుడు కండ్రిగ, పంచాయతీల్లో పొలాల్లోకి వెళ్లి వరదలకు నష్టం సంభవించిన రైతుల పొలాలను పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ వరి పైరు నాటిన 45 రోజుల లోపు పంటనష్టం వాటిల్లితే ప్రభుత్వం విత్తనాలు మాత్రమే రైతులకు సబ్సిడీగా ఇస్తుందని ప్రభుత్వం ఇచ్చిన రకమే ఈక్రాప్‌లో నమోదు చేయాలని ఆ రకాన్ని రైతుల పొలంలో పండించాలని సూచించారు. మట్టి నమూనా సేకరించి, భూసార పరీక్షలు చేయించుకొని తగిన మోతాదులో ఎరువులు వాడటం వల్ల రైతుకు ఖర్చులు తగ్గుతాయని పేర్కొన్నారు. రబి 2024- 25 సీజన్‌కు పంట ఇన్సూరెన్సుకు సంబంధించి వరికి ప్రీమియం రూ.630, డిసెంబర్ 31, వేరుశనగకు రూ.450 ఈ నెల లోపు చెల్లించాలని సూచించారు. సిఎస్‌సి సెంటర్లో రైతులు క్రాఫ్ ఇన్సూరెన్స్ నమోదు చేసుకోవాలన్నారు. ఉలవలు, వేరుశనగ పంట పొలాలను పరిశీలించారు. గ్రామ సభలో నిర్వహించి పంట పొలాలలో రైతులు పాటించాల్సిన మెళుకువలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు, రైతు సేవా సిబ్బంది పాల్గొన్నారు.

పెరిగిన చలి తీవ్రత

వణుకుతున్న వృద్ధులు

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: అల్పపీడన ప్రభావం కారణంగా, బుచ్చినాయడు కండ్రిగ మండలంలో ఇప్పటికే చెరువులు వాగులు, వంకలు నిండిపోవడంతో చలిగాలులు ఎక్కువగా వీస్తున్నాయి. ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. ఇప్పటికే పూర్తిస్థాయిలో నిండిన కె.వి పురం మండలం కాళంగి లోని కాలంగి రిజర్వాయర్ పొంగిపొర్లడంతో మండలంలోని అన్ని గ్రామపంచాయతీల దాదాపుగా నియోజకవర్గంలోని అన్ని చెరువులు పూర్తిస్థాయిలో నిండి పారుతున్నాయి. పెరిగిన చలి వృద్ధులను మరింత ఆందోళనకు గురిచేస్తోంది.

ఐ మాక్స్ లైట్లు ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణంలోని శివా, నంది సర్కిల్స్ భక్త కన్నప్ప సర్కిల్స్ వద్ద ఐమాక్స్ లైట్లు ఏర్పాటు చేయాలని ట్రస్ట్ బోర్డు మాజీ ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. గత ప్రభుత్వ హయాంలో దక్షిణ కైలాస క్షేత్రానికి ఆధ్యాత్మిక శోభ చేకూరేలా పట్టణంలోని ప్రధాన కూడలి ప్రాంతాల్లో ఆధ్యాత్మిక ఆకర్షణీయమైన సర్కిల్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఆయా కూడలిలో అత్యంత ఆకర్షణీయంగా దేవతామూర్తులను ఏర్పాటు చేసి, వాటికి మరింత శోభ వచ్చే విధంగా ఐమాక్స్ లైట్లు ఏర్పాటు చేసేందుకు ఎనిమిది లక్షల రూపాయలు మంజూరు చేశామని అన్నారు. అయితే ఎన్నికల కోడ్ రావడంతో ఐ మ్యాక్స్ లైట్ల ఏర్పాటు పనులు కేవలం బేస్మెంట్ పనులతోనే నిలిచిపోయాయని వాపోయారు. ఆయా సర్కిల్స్ లో ఐ మ్యాక్స్ లైట్లు ఏర్పాటు చేస్తే ప్రత్యేకమైన ఆకర్షణ తో ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లుతాయని తెలిపారు.



మాట్లాడుతున్న ట్రస్ట్‌బోర్డు మాజీ ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు



ఎమ్మెల్యేకు జ్ఞాపిక బహూకరించి సన్మానిస్తున్న దృశ్యం

ఘనంగా ఎన్‌డిఎల్‌ఎస్ గురుకుల వార్షికోత్సవం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: స్థానిక మహతి ఆడిటోరియంలో శుక్రవారం ఎన్‌డిఎల్‌ఎస్ గురుకుల పాఠశాల 28 వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కోట పురుషోత్తం, డివైఇఓ బాలాజీ, ఎంఈఓ భాస్కర్, పాఠశాల కరస్పాండెంట్ ధనలక్ష్మి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యాదశ నుండే క్రమశిక్షణతో ఉన్నప్పుడే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అందు కోవడానికి అర్హత సాధిస్తా రన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి మంచి విజయాలు సాధించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులు సమయపాలనతో చదువుతూ మంచి ఉత్తీర్ణత శాతం సాధించాలన్నారు. డివైఓ బాలాజీ మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రులకు మంచిపేరు తెచ్చిపెట్టే విధంగా నడవడిక ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

యోగాసన ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎన్‌ఎస్‌యూ విద్యార్థులు

ప్రజాశక్తి - క్యాంపస్ : భువనేశ్వర్‌లోని కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆల్ ఇండియా యోగాసనా ఛాంపియన్‌షిప్ కోసం జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, యోగా విజ్ఞాన విభాగం, విద్యార్థులను ఎంపికచేసి వారిని ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ యోగాసనా ఛాంపియన్-2024లో పాల్గొనడానికి విశ్వవిద్యాలయం తరపున 11 మంది విద్యార్థులను పంపిస్తామని, ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులందరూ చక్కని ప్రదర్శన చేసి విశ్వవిద్యాలయానికి పురస్కారాలు తీసుకురావాలని సూచించారు. ఆయన ఎంపికైన యోగా విద్యార్థులందరికీ ట్రాక్ సూట్‌లను పంపిణీ చేసి, శుభాశీస్సులు అందించి వారిని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో డాక్టరు ఆర్ లక్ష్మీనారాయణ, యోగ విజ్ఞాన విభాగ ఇన్‌ఛార్జి విభాగాధ్యక్షులు, కెసి లోకేశ్వర్ యోగవిభాగ అధ్యాపకులు, డాక్టరు వి సేతురాం అసిస్టెంట్ డైరెక్టర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ ఈవెంట్‌లో పాల్గొనడానికి వెళ్లే విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విభిన్న విభాగాల అధ్యాపకులు శుభాభినందనలు తెలిపారు.

'కోటక్ బిజ్‌ల్యాబ్స్ యాక్సిలరేటర్ 'ఆవిష్కరణ

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: సీఎస్ఆర్ ఓ నూతన కార్యక్రమం కోటక్ బిజ్ ల్యాబ్స్ యాక్సిలరేటర్ ప్రోగ్రామ్‌ను శుక్రవారం ప్రారంభించింది. స్టార్టప్‌లు వృద్ధి సవాళ్లను అధిగమించడానికి, వాటి వ్యాపారాలను సమర్థవంతంగా పెంచుకోవడానికి, సహాయపడటానికి ఈ ప్రోగ్రామ్ రూపొందించారు. ఐఐఎంఏ వెంచర్స్, ఎన్ఎస్ఆర్‌సి ఈఎల్ , టి-హబ్ టాప్ ఇంక్యుబేటర్‌ల సహకారంతో, మెంటర్ షిప్, మార్కెట్ యాక్సెస్, అడ్వైజరీ సపోర్ట్‌తో సహా తగిన యాక్సిలరేషన్ కార్యక్రమాలను కోటక్ బిజ్ ల్యాబ్స్ అందిస్తోంది. ఈ సందర్భంగా కోటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్, సీనియర్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, సీఎస్ఆర్, ఈఎస్ జి హెడ్ - హిమాన్షు నివ్‌సర్కర్ మాట్లాడుతూ, ప్రారంభ దశ స్టార్టప్ నుండి అభివృద్ధి చెందు తున్న వ్యాపారం వరకు ప్రయాణం సవాళ్లతో కూడుకుందని, స్టార్టప్‌లకు తమ వృద్ధిని వేగవంతం చేయడానికి నిధులకు మించి ప్రత్యేక మద్దతు, మార్గదర్శకత్వం, వ్యూహాత్మక భాగస్వామ్యం అవసరమని కోటక్‌లో తాము గుర్తించామని, కోటక్ బిజ్‌ల్యాబ్స్ యాక్సిలరేటర్ ప్రోగ్రామ్ భారతదేశంలో స్వయం ఉపాధి సెగ్మెంట్ స్ఫూర్తిని పెంపొందించడంలో కోటక్ మహీంద్రా బ్యాంక్ నిబద్ధతకు నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమం ఆశావహ భారతీయుల కలలకు స్ఫూర్తి నిచ్చేందుకు, వినూత్నతలను ముందుకు నడపడానికి, స్వయం-ఉపాధి కోసం ఒక బలమైన పర్యావరణ వ్యవస్థను రూపొందించడానికి కోటక్ దృక్పథానికి అనుగుణంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలోఎన్ఎస్ఆర్‌సీఈఎల్ సీఈఓ ఆనంద్ గణేష్ పాల్గొన్నారు.

పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ , వసతి దీవెన సాయం విడుదల చేయాలి..

ప్రజాశక్తి - క్యాంపస్ : రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ చదువుతున్న విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన డబ్బులు విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి శివారెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి చలపతి డిమాండు చేశారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ బిల్డింగు వద్ద శుక్రవారం వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ 2,100 కోట్లు, వసతి దీవెన 14,80 కోట్లు పెండింగ్ లో ఉన్నాయని, తక్షణమే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రతి సంవత్సరం విద్యార్థులకు సంబంధించి నాలుగు క్వార్టర్ల రూపంలో డబ్బులు జమ అయ్యేవని, గత సంవత్సరం విద్యార్థులకు ఒక క్వార్టర్ మాత్రమే విడుదలపై మిగతా మూడు విడతలు విడుదల కాలేదని తెలిపారు. రాష్ట్రంలో దాదాపు 9.5 లక్షల మంది విద్యార్థులు డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ విద్యను అభ్యసిస్తున్నారని, దానిలో క్వార్టర్ ఫీజులు రూ.708 కోట్లు విడుదల చేశారన్నారు. మూడు విడతలకు దాదాపు రూ.2100 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన డబ్బులు విడుదల కాక విద్యార్థులకు కోర్సులు ముగిసినా సర్టిఫికెట్లు ఇవ్వకుండా కళాశాల యాజమాన్యం ఫీజు చెల్లిస్తేనే ఇస్తామని విద్యార్థులకు ఆందోళనకు గురిచేస్తున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఫీజులు కట్టలేక సర్టిఫికెట్లు తీసుకోలేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గతంలో పెండింగ్‌లో వున్న ఉన్న డబ్బులు చెల్లిస్తేనే వారిని పరీక్షలకు అనుమతి ఇస్తామని కళాశాల యజమానులు తెలిపారన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఫీజు రీయింబర్సుమెంటు ఇస్తామని, తాము అధికారంలోకి వస్తే జీవో నెంబర్ 77ను రద్దు చేస్తామని పాదయాత్రలో చెప్పిన లోకేష్ అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పైబడినా ఇంత వరకు జీవో నెంబర్ 77 పై మాట్లాడటం లేదని మండిపడ్డారు.